# అభివృద్ధి రధచక్రాలు వచ్చేసాయి! విచ్చేసాయి!!

## నలిగిపోతున్న వంశధార గ్రామాలు



వంశధార ప్రాజెక్టు వస్తే మన శ్రీకాకుళం జిల్లా మరింత సస్య శ్యామలమవుతుంది. 2,10,000 ఎకరాలలో పంటల స్థిరీకరణతో పాటుగా 45,000 ఎకరాలకు అదనంగా సాగునీరు అందుతుందని చెబుతున్నారు. కాకపోతే ఎంతో అందంగా, ఆశాజనకంగా కనిపించే ఈ అభివృద్ధి చిత్రపటం వెనక ఉన్న విషాదం మనకు కనబడదు. మన జీవితాల్లో వెలుగులు నింపడం కోసం తులగాం, గార్లపాడు, దుగ్గపురం, చినసంకిలి, పాడలి గ్రామాల ప్రజలు చీకట్లోకి నెట్టబడడం మనకు కనబడదు. వారి త్యాగాలకు ఫలితంగా ప్రభుత్వం వారి పంటలను నాశనం చేసింది. సరైన నష్టపరిహారం అడిగినందుకు వారిపై కేసులు పెట్టింది. పంచ రత్నాలుగా ప్రసిద్ధిచెందిన ఆ గ్రామాలు ఇవాళ స్మశానాలుగా మిగిలాయి. అభివృద్ధి రధచక్రాల క్రింద నలిగిపోతున్న నిర్వాసిత ప్రజల గోడును కూడా తెలుసుకోవాల్సిన రోజులొచ్చాయి. ఎందుకంటే ముందు ముందు ఈ రథం అన్ని ప్రాంతాల్లో తిరగనుంది.

*కంపెనీలకు వచ్చే లాభాన్ని, వారి అభివృద్ధిని దేశం అభివృద్ధిగానో, రాష్ట్ర అభివృద్ధిగానో పిలిచేవారు నిర్వాసితులయ్యే వేలాది ప్రజలకు కలిగే నష్టాన్ని దేశం నష్టంగాను, రాష్ట్రం నష్టంగాను భావించి దేశం, లేక రాష్ట్రం దానిని భరించాలని ఎందుకు అడగరు?అటువంటి చట్టంగానీ, విధానం గానీ దేశంలో ఎందుకు లేదని ఎందుకడగరు? ఉన్నవాళ్ళ అభివృద్ధి కోసం లేనివాళ్ళు పూర్తిగా పతనం అయ్యే ప్రగతిని మనం ఎందుకు అంగీకరించాలి?*

***– కె. బాలగోపాల్***

## జరిగిన కథ



వంశధార ప్రాజెక్టు ఫేజ్ II స్టేజ్ II లో భాగంగా హిరమండలం రిజర్వాయర్ నిర్మాణాన్ని 2005లో తలపెట్టారు. దానికింద హిరమండలం, కొత్తూరు, ఎల్.ఎన్. పేట మండలాల్లో 20 గ్రామాలు పూర్తిగా, 14 గ్రామాలు పాక్షికంగా ముంపుకు గురవుతాయని ప్రకటించారు. ఆ గ్రామాల్లో 2007-08లోనే భూసేకరణ జరిపి మెట్టు భూమికి 88,000 రూపాయలు, పల్లానికి 1,30,000 రూపాయలు నష్ట పరిహారం ఇస్తూ అవార్డు ప్రకటించారు. అంతేగాక వారందరికీ జి.ఓ. 68 ప్రకారం పునరావాసం కల్పిస్తామని వాగ్దానం కూడా చేసారు. ఇదంతా జరుగుతుండగా ఒరిస్సా ఈ ప్రాజెక్టుపై తన అభ్యంతరాలను తెలుపుతూ కోర్టును ఆశ్రయించం వల్ల హిరమండలం రిజర్వాయర్ పని మొదలు కాలేదు. ఆ గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించలేదు గనక వాళ్ళు అక్కడే ఉండిపోయి తమ భూముల్లోనే గత తొమ్మిదేళ్ళుగా వ్యవసాయం కొనసాగించారు. ఆ భూముల మీదే రుణాలు, రుణ మాఫీలూ కూడా పొందుతూ వచ్చారు.

## ఇప్పుడు జరుగుతున్నది

ఒరిస్సాతో నీటి వివాదం కొలిక్కి వస్తున్న తరుణంలో జూన్ 2017లో రెవిన్యూ అధికార్లు ఈ గ్రామాలను ఖాళీ చేయాలని చెప్పారు. భూమికి అరకొర నష్టపరిహారం ఇచ్చి, పునరావాసం కల్పించకుండా తొమ్మిదేళ్ళ తర్వాత వచ్చి ఖాళీ చేయమనే సరికి ప్రజలు ఆగ్రహించారు. చదువుకున్న వాళ్ళు, చట్టం తెలిసిన వాళ్లు ఇది అన్యాయమని ప్రశ్నించారు. పునరావాసం కల్పించమని డిమాండ్ చేసారు. ప్రభుత్వాన్ని చట్ట ప్రకారం నడుచుకోమని చెప్పడం వాళ్ళు చేసిన పెద్ద తప్పు. అక్కడనుండి ప్రభుత్వ యంత్రాంగం అన్ని చట్టాలను, కనీస మానవ విలువలను ప్రక్కన పెట్టేసి కక్షపూరితంగా వ్యవహరించారు. జులై నెలలో పంటచేలను దున్నించి 250 ఎకరాల్లో పంటలను నాశనం చేశారు. ఈ వార్తలు బయటకి రాకుండా, వేరేవారు గ్రామాలను సందర్శించకుండా గ్రామాల్లో భారీ ఎత్తున పోలీసులను మోహరించి సెక్షన్ 30 ని అమలు చేసి ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేసారు. ఆఖరి పంటను కాపాడుకోవడం కోసం కోర్టుకు వెళ్ళాలన్న

రెవిన్యూ అధికార్లు వాళ్ళకి అవార్డు కాపీలను అందకుండా చేసారు. ఇంతా చేసి తులగాం, ఇరపాడు, దుగ్గుపురం గ్రామాల్లో ఉన్నది తీవ్రవాదులు కాదు రైతులే. అయినా ఆ ప్రాంతం కాశ్మీర్‌ని తలపించింది. చివరికి మానవహక్కుల వేదిక ప్రజా ప్రయోజన వాజ్యం (పిల్) ద్వారా హైకోర్టు జోక్యం చేసుకుంటే గాని అధికార్లు 'పంట విధ్వంస కార్యక్రమం' ఆపలేదు.

## పునరావాసం నష్టపరిహారం

ప్రభుత్వం ఇంతకుముందు వాగ్దానం చేసినట్లు జి.ఓ. 68 ప్రకారం గాని లేదా ప్రస్తుత 2013 చట్టం ప్రకారం గాని న్యాయమైన నష్టపరిహారం, పునరావాసం ఊసే ఎత్తలేదు. జిల్లా కలెక్టర్ 18 సం॥ దాటిన యువకులకు కుటుంబానికి 5లక్షల యూత్ ప్యాకేజి ప్రకటించి, అది కూడా అరకొరగా రాజకీయ పలుకబడి వున్నవారికి ఇచ్చారు. కొంతమందికి ఇళ్ళ స్థలాలిచ్చి, ఇల్లు కట్టుకోవడానికి 53,000 రూపాయలు ఇస్తే దానితో ఇల్లెలా కట్టుకోవాలో తెలియక సతమతమవుతున్నారు. కొందరికి పట్టాలిచ్చినా స్థలాలెక్కడున్నాయో తెలీదు. కొంతమంది యే సౌకర్యాలు లేని పునరావాస కాలనీల్లో తలదాచుకుంటున్నారు. ఉన్న ఊరికి 40 కి.మీ. దూరం వరకు చెల్లా చెదురైపోయారు. దిక్కుతోచని స్థితిలో మళ్ళీ తమ జీవితాలను నిలబెట్టుకునే పనిలో పడ్డారు. ఎన్నో తుఫాన్లకు ప్రకృతి ప్రకోపాలకు ఎదురొడ్డి నిలిచిన ఆ ప్రజలను ప్రభుత్వమే నిలువునా ముంచింది.

## చట్టం ఏం చెబుతుంది?

భూసేకరణ కోసం ఇంతవరకూ బ్రిటిష్ కాలంనాటి 1894 చట్టాన్నే ప్రభుత్వం ఉపయోగిస్తూ వచ్చింది. ఆ చట్టంవల్ల భూ నిర్వాసితులకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ ఎన్నో ప్రజా ఉద్యమాలు జరిగాయి. ప్రజలు జీవించే హక్కు ప్రాతిపదికగా చట్టాన్ని మార్చాలనీ, అభివృద్ధిలో ప్రజల్ని భాగస్వాముల్ని చేయాలనే ఆ ఉద్యమాలు డిమాండ్ చేసాయి.

ఆ ఉద్యమాల ఫలితంగానే 2005లో మన రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ. 68 ని తీసుకొచ్చి కొంత మెరుగైన నష్టపరిహారాన్ని ప్రకటించింది. వంశధార నిర్వాసితులకు కూడా దాన్నే అమలు చేశారు. తర్వాత 2013లో కొత్త భూసేకరణ చట్టం వచ్చింది. దాని పేరే **"భూసేకరణ, పునరావాస ప్రక్రియలలో పారదర్శకత, న్యాయమైన నష్టపరిహార హక్కు చట్టం 2013"**. ఈ చట్టంలో న్యాయమైన పరిహారాన్ని ఒక హక్కుగా మొట్టమొదటిసారి గుర్తించారు. అలాగే భూసేకరణ అంశాన్నీ, పునరావాస నష్ట పరిహార అంశాల్నీ ఇది

మొదటిసారిగా కలిపి చూసింది. వంశధార నిర్వాసితులకు ఈ చట్టం ఎలా వర్తిస్తుందో చూద్దాం.

భూసేకరణ ప్రక్రియ పూర్తి అయిన 5 సంవత్సరాలలోపు నిర్దేశిత ప్రాజెక్టు పని మొదలు కాకపోతే ఆ భూమిని తిరిగి మునుపటి యజమానికి అప్పగించాలని ఈ చట్టం అంటుంది. భూములకిచ్చే నష్టపరిహారం అప్పుడున్న మార్కెట్ రేటు కన్నా మూడు లేదా నాలుగు రెట్లు ఉండాలి. దీనికోసం మార్కెట్ రేటును జిల్లా కలెక్టర్ సవరించాలి. దానికి తోడు బలవంతంగా భూమిని స్వాధీనం చేసుకుంటున్నందుకు 30 శాతం పరిహారం (సొలేషియం) అదనంగా ఇవ్వాలి. దళితులకూ, బడుగులకూ ఇచ్చిన డి. పట్టా భూమికి కూడా జిరాయితీ భూమికి ఇచ్చినట్లుగానే నష్టపరిహారం ఇవ్వాలి.

ఈ ప్రాజెక్టు వల్ల ప్రభావితం అవుతున్న వారందరూ పునరావాసానికి అర్హులే. అంటే కేవలం భూమి ఉన్నవాళ్ళేగాక, అక్కడ నివసిస్తున్న భూమిలేని నిరుపేదలూ, ఇతర వృత్తుల వారందరూ ప్రాజెక్టు ప్రభావితులవుతారు. వారందరికీ వివిధ స్థాయిలలో నష్ట పరిహారంతో పాటు నివాస వసతి ఏర్పాటు చేయ్యవలసిందే.

జీవనోపాధి కోల్పోతున్నవారికి ప్రాజెక్టులో ఉద్యోగంగాని లేదా ఒక్కో కుటుంబానికి ఇరవయ్యి సంవత్సరాల పాటు నెలకు 2000 రూపాయలు భృతిగానీ చెల్లించాలి. చేతి వృత్తుల వారికి, చిన్న వ్యాపారస్తులకు ఒకే విడత నష్టపరిహారంగా 25,000 రూపాయలు ఇవ్వాలి.ఇతర ప్రాంతాలకి తరలించబడే కుటుంబాలకి రవాణా ఖర్చుల నిమిత్తం 50,000 రూపాయలతో పాటు పునఃనివాసానికి మరొక 50,000 చెల్లించాలి.

వంశధార ప్రాజెక్టు నిర్వాసిత గ్రామాల్లో భూసేకరణ ప్రక్రియ జరిపి 5 సంవత్సరాలు దాటిపోయింది గనుక వీరందరూ 2013 భూసేకరణ ప్రక్రియకి ముమ్మాటికీ అర్హులే. ఎందుకంటే కొత్త చట్టం వచ్చాక జి.ఓ. 68 కి  కాలం చెల్లినట్లే. ప్రజలకి చట్టం తెలియకపోయినా ప్రభుత్వానికి తెలుసు కదా!  తెలిసి ఉండీ మోసపూరితంగా, అన్యాయంగా వ్యవహరించింది. అంతేగాక ఎన్నో ఉద్యమాల ఫలితంగా వచ్చిన ఈ చట్టాన్ని తమకు అనుకూలంగా సవరించాలని కూడా ప్రభుత్వం ఆలోచనలు చేస్తున్నది. వంశధార ముంపు గ్రామాల ప్రజలకు న్యాయమైన, మానవీయమైన పునరావాసం కల్పించమని ఇప్పుడు గొంతెత్తకపోతే ముందుముందు అభివృద్ధి రథచక్రాల క్రింద ఎంతోమంది నలిగిపోతారు.

---

**మానవహక్కుల వేదిక**

Human Rights Forum (HRF)

శ్రీకాకుళం జిల్లా శాఖ

30-1-2018

ప్రచురణ : **కె.వి.జగన్నాథరావు,** HRF శ్రీకాకుళం. సెల్ : 9440112551.